సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 8 । జూన్ । 2025



విత్తన ఎంపికే కీలకం
పంటల సాగులో విత్తన ఎంపిక కీలకం. ఇది పైరు ఎదుగుదలతోపాటు చీడపీడలను తట్టుకుని.. నాణ్యమైన అధిక దిగుబడులకు దోహదం చేస్తోంది. -10లో



ప్రాణం తీసిన ఈత సరదా
సరదాగా ఈత కొట్టేందుకు పెన్నా నదిలోని నీటిలోకి దిగిన తండ్రీకొడుకులు దుర్మరణం చెందిన సంఘటన శనివారం జమ్మలమడుగు మండలంలో చోటుచేసుకుంది. -10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.4/28.0
జిల్లాలో శనివారం 28.0- 38.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.23 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

హామీలు.. నీటి మీద రాతలు

- అటకెక్కిన 50 ఏళ్లకే పెన్షన్ వాగ్దానం
- అందని ద్రాక్షలా ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి
- విద్యుత్ చార్జీలు పెంచమంటూనే బాదుడే బాదుడు
- వలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తామని మోసం
- 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.15 వందలు ఉత్తిదే
- రైతుకు పెట్టుబడి సాయం ఊసేలేదు
- 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' పేరుతో ఊదరగొట్టిన తెలుగు తమ్ముళ్లు
- అమలు కాని సూపర్ సిక్స్ పథకాలు
- చంద్రబాబు ఏడాది పాలనపై మండిపడుతున్న ప్రజలు, విపక్షాలు



సాక్షి ప్రతినిధి, కడప: ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ఊదరగొట్టారు. 'బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ' అన్నారు. అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని నమ్మించారు. అధికారం కోసం ముఖానికి అబద్ధాల హామీల ముసుగు వేసుకున్నారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలు మరోమారు సీఎం చంద్రబాబు చేతిలో దగాకు గురయ్యారు. ఏడాదైనా ఇచ్చిన హామీలు అమలు కాలేదు. నాటి మాటలు నీటి మూటలేనని తేటతెల్లమైంది. తల్లికి వందనమంటూ చెప్పి.. శఠగోపం పెట్టారు. నిరుద్యోగ భృతి అందని ద్రాక్ష పుల్లనలా ఉండిపోయింది. కర్షకుల కన్నీరు తుడుస్తానంటూ పెట్టుబడి సాయం మాటే మర్చిపోయారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామన్న మాట ఊసేలేదు. వెరసి నమ్మి మోసపోయామంటూ మహిళాలోకం ఆక్రోశం చెందుతోంది.

ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలంటూ..

'ప్రతి ఇంటికి ఉద్యోగం.. లేదంటే, నిరుద్యోగ భృతి రూ.3 వేలు తప్పకుండా ఇస్తాం ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం' అని ఎన్నికల హామీల్లో ప్రధానంగా చెప్పుకొచ్చారు. ఏడాదైంది, ఒక్కటంటే ఒక్క ఉద్యోగం రాలేదు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిరుద్యోగికి ఇప్పటికీ ప్రభుత్వం రూ.36 వేలు బకాయి ఉన్నట్లే. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు జిల్లా వ్యాప్తంగా 5,82,633 కుటుంబాలు ఉన్నాయి. బీపీఎల్ కుటుంబాలకు చెందిన చదువుకున్న నిరుద్యోగ యువకులంతా నిరుద్యోగ భృతికి అర్హులే. అలాగే అమ్మఒడి పథ కం ద్వారా నాలుగేళ్లలో వైఎస్ జగన్ సర్కారు రూ. 1,337.4 కోట్లు చెల్లించారు. కాగా, ఆ స్థానంలో తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అందరికీ వర్తింపజేస్తామని చంద్రబాబు ఎన్నికల హామీగా ప్రకటించారు. ఏడాదిగా ఒక్క రూపాయి ఇవ్వలేదు. విద్యార్థుల తల్లిదండ్రులకు శఠగోపం పెట్టారు.

ఊరిస్తున్న ఉచిత బస్సు

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తాం. అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళాలోకం ఇకపై ఎక్కడికెళ్లినా ఉచితంగా ప్రయాణం చేయవచ్చును' అని హామీ ఇచ్చారు. ఇదిగో అదిగో సంక్రాంతి, ఉగాదికి అమలు చేస్తామని ఊరిస్తూ వచ్చారు. జిల్లాలో ప్రజారవాణాలో ఉన్న 590 బస్సుల ద్వారా ప్రతి రోజు 1.29 లక్షల మంది సరాసరిగా ప్రయాణం చేస్తున్నారు. వారిలో 30 శాతం మంది మహిళలు ప్రతి రోజు ప్రయాణిస్తున్నారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే 38,700 మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. ఏడాదైనా వారికి ఉచిత బస్సు ప్రయాణం అవకాశం దక్కలేదు. మరో వైపు వలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తామని, వారికి గౌరవ వేతనం రూ.5 వేల స్థానంలో రూ.10 వేలు చేస్తామని ప్రకటించారు. ఆపై ఉన్న ఉపాధి కూడా లేకుండా చేశారు. జిల్లా వ్యాప్తంగా 10,890 మంది సచివాలయ వ్యవస్థ పరిధిలో ఉన్న వలంటీర్లు నిరుద్యోగులయ్యారు. అలాగే మరో 366 మంది రేషన్ బండ్ల ఆపరేటర్లు నిరాశ్రయులయ్యారు.

విద్యుత్ బిల్లులు బాదుడే.. బాదుడు

అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోమని, తగ్గిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. కాగా, అసలు కంటే కొసరు అధికంగా ఉండేలా విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. విద్యుత్ వాడకం కంటే డబుల్ బిల్లు వినియోగదారులకు వస్తోంది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జెస్ట్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ) కింద జిల్లా ప్రజలపై కూటమి ప్రభుత్వం కోట్లలో భారం మోపింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన సర్దుబాటు పేరుతో ప్రతి నెలా వడ్డనకు ప్రయత్నాలు చేస్తున్నారు. గడిచిన కాలంలో సర్దుబాటు చార్జీలకు తోడుగా అక్టోబర్ నెల నుంచి ఏ నెలకు ఆనెల సర్దుబాటు పేరుతో యూనిట్‌కు 91 పైసల చొప్పున భారం వేస్తున్నారు. ఇలా ప్రతి నెలా సుమారు రూ.15 కోట్లను వసూలు చేయనున్నట్లు విద్యుత్ అధికారుల గణాంకాలు వివరిస్తున్నాయి. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఊరువాడ చెప్పుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాజాగా వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. అసలు కంటే కొసరు రూపంలో ముక్కుపిండి రాబట్టుతున్నారు. సామాన్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

» వైఎస్ జగన్ సర్కార్‌లో..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో నిమిత్తం లేదు. చెప్పిన మాట చెప్పినట్లుగా అమలు చేయడమే లక్ష్యంగా గడిచిన ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పని చేసింది. కొనసాగించింది. కేలండర్ విడుదల చేసి ఏ పథకం ఎప్పుడు అమలు చేస్తామన్న విషయాన్ని తేదీలతో సహా బహిర్గతం చేసి.. సరిగ్గా ఆ తేదికి అమలు చేసిన చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సొంతమైంది. జిల్లాలో డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు 9,82,554 మందికి రూ.8,857.42 కోట్లు వేశారు. సామాన్య కుటుంబాలకు కామధేనువులా వైఎస్ జగన్ సర్కార్ కాపాడింది. ఎన్నికల్లో అంతకంటే ఎక్కువగా అందిస్తామని సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశ పెట్టిన టీడీపీ ప్రజల్ని మభ్యపెట్టింది. చంద్రబాబు సర్కార్ కూడా ఆ పథకాలు ద్వారా చెల్లింపులు చేస్తారని భావించి మోసపోయారని విశ్లేషకులు వివరిస్తున్నారు.

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం లేని నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలు అమలు చేస్తారని ఎదురు చూస్తున్నాం. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను పీకేస్తున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఇకనైనా ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వాలి.
– జి. ఉమామహేష్, మరియాపురం, కడప

ఉచిత బస్సు ప్రయాణం హుళక్కేనా?



18–49 ఏళ్లలోపు ఉన్న మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల ముందు చెప్పారు. అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా దాని గురించి పట్టించుకోవడం లేదు. అసలు ఇస్తారో, ఇవ్వరో కూడా తెలియడం లేదు. గత ప్రభుత్వంలో ఏ పథకం ఎప్పుడు ఇచ్చేది తేది ప్రకటించి మరీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని కూడా చెప్పారు. అదీ చేయలేదు.
– పత్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు, కడప

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారు



ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెలా ఆడ బిడ్డ నిధి పేరుతో రూ.1500 లు ఇస్తామని చెప్పాడు. ఇప్పుడేమో అధికారంలోకి వచ్చిన ఏడాది అయినా దాని ఊసే ఎత్తడం లేదు. ప్రతి నెలా రూ.1500 ఇస్తే కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుంది. గత ప్రభుత్వంలో ఏడాది క్రమం తప్పకుండా రూ.45 వేలు వచ్చేది. ఇప్పుడేమో రూ.1500 లేదు, అప్పుడిచ్చే రూ.18 వేలు లేకుండా పోయింది.
–కానాల విజయ, గృహిణి, ఎకోపల్లె గ్రామం, దువ్వూరు మండలం

» పథకాల పేర్లు మార్చి.. ఆచరణలో మరిచి..

అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూపులు



కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా అన్నదాత సుఖీభవ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా ద్వారా మూడు విడతల్లో పంట సాగు సమయానికి డబ్బులు అందేవి.
–సీవీ సుబ్బారెడ్డి, రైతు, పడమర అనంతపురం, చాపాడు మండలం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా అందిస్తుంటే.. ఆ స్థానంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వనున్నట్లు ఎన్నికల హామీ ఇచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రైతు భరోసా పేరిట ఐదేళ్లలో రూ.1,191.03 కోట్లు నేరుగా అందించారు. కర్షకులకు అండగా నిలవాలన్న ఆలోచన చంద్రబాబు సర్కారు చేయడం లేదు. జిల్లా వ్యాప్తంగా 2,10,481 మంది రైతులు సుఖీభవ పథకానికి అర్హులు. ఈ పథకం ద్వారా రూ.420.96 కోట్లు రైతులకు అందించాల్సి ఉంది. పీఎం కిసాన్ సాయం నిధుల ద్వారా ఇప్పటికీ కేవలం రూ.2 వేల చొప్పున మాత్రమే రైతులకు నేరుగా లభించింది. అంటే కేవలం రూ.42.09 కోట్లు మాత్రమే వర్తించింది. దాదాపు రూ.380 కోట్లు ఇంకా లభించాల్సి ఉంది. ఆ దిశగా చంద్రబాబు సర్కారు అడుగులు వేయడం లేదని కర్షకులు మండిపడుతున్నారు. పథకాల పేర్లు ఘనంగా పెట్టారు, కానీ అమలులో చిత్తశుద్ధి లేదని పలువురు వాపోతున్నారు. ఆడబిడ్డ నిధి పథకం కూడా అదే పరిస్థితి. 18 ఏళ్ల నిండిన యువతి నుంచి 59 ఏళ్ల వరకు ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డ నిధి చెల్లిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఊరువాడ చెప్పుకొచ్చారు. ఇప్పటికీ పైసా కూడా ఇవ్వలేదు. ప్రతి మహిళకు రూ.18 వేలు బకాయి ఉన్నట్లేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మహిళలు ఆత్మభిమానంతో జీవించాలని మునుపటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు భావిస్తే, చంద్రబాబు ప్రభుత్వం తద్భిన్నంగా పాలిస్తూ ఏకంగా మహిళలోకాన్ని వంచిస్తోందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

నిరుద్యోగులకు మళ్లీ మోసం



నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకూ ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని ఎన్నికల ముందు చెప్పారు. ఇప్పుడేమో ఎలాంటి ప్రకటన చేయడం లేదు. 2014–19లో కూడా ఇలాగే చెప్పి ఎన్నికల ముందు రెండు నెలలు ఇచ్చారు.
–భూమిరెడ్డి భాస్కర్, బీఎస్సీ, బీఈడీ, నిరుద్యోగి, లింగాలదిన్నెపల్లె, బ్రహ్మంగారిమఠం మండలం

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

కడప కోటిరెడ్డి సర్కిల్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయని ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 5315 మంది హాజరు కాగా 2266 మంది పాస్ అయ్యారని, ఉత్తీర్ణత 46 శాతంగా నమోదైందని ఆయన పేర్కొన్నారు. సెకండ్ ఇయర్‌లో 3836 మంది హాజరు కాగా 2384 మంది పాస్ అయ్యారని, ఉత్తీర్ణత 62 శాతం నమోదైందన్నారు. రాష్ట్రంలో ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ రెండింటిలో జిల్లా 15వ స్థానంలో నిలిచిందని వివరించారు.

11న పాత్రికేయులకు యోగా శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్: కడపలోని రాజీవ్ పార్కు ఎదురుగా రాజీవ్ మార్గ్‌లో ఈ నెల 11న పాత్రికేయులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'యోగాంధ్ర- 2025' మాసోత్సవాల్లో భాగంగా మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు జరిగే యోగా కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేకించి జూన్ 11న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జర్నలిస్టులకు యోగా శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డెస్క్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కడప అర్బన్: రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా జిల్లాలో రోడ్డు భద్రతపై ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ సూచనలతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యార్థులు, యువత, ఆటో, ట్యాక్సీ, లారీ డ్రైవర్లు, ద్విచక్ర వాహన దారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

డీసీసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సూర్యనారాయణరెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్: డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి శనివారం కడపలోని మాధవి కన్వెన్షన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణరెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కడపలో బక్రీద్ సందేశం ఇస్తున్న ముఫ్తీ న్యామతుల్లా సాహెబ్, భక్తులతో కలిసి నమాజ్ చేస్తున్న పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్





భక్తిశ్రద్ధలతో బక్రీద్



ముస్లింలకు రెండో పెద్ద పండుగ బక్రీద్. ఈ వేడుకను జిల్లాలో శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అల్లాపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ.. త్యాగాలకు మారుపేరుగా ఈ పర్వదినాన్ని జరుపుకొన్నారు. ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు పండుగ ప్రాధాన్యత, విశిష్టతను వివరించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



పులివెందులలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బద్వేలులో...



కడపలోని ఈద్గా మైదానంలో...



ప్రొద్దుటూరులో...



దువా చేస్తున్న చిన్నారి

టీడీపీని వీడిన సుగవాసి

- బలిజ సామాజిక వర్గాన్ని విస్మరిస్తున్న తెలుగుదేశం పార్టీ
- ఎమ్మెల్సీ సీఆర్సీ, మాజీ ఎమ్మెల్సీ బత్యాల, సుగవాసి బ్రదర్స్‌కు అప్రాధాన్యత
- ఎన్నికల్లో ముందు పెట్టుకొని, ఆపై పక్కన పెట్టిన టీడీపీ నేతలు
- ఎన్నో ఏళ్ల అనుబంధాన్ని తెంచుకున్న బాలసుబ్రహ్మణ్యం
- పాలకొండ్రాయుడు మృతి తర్వాత పరామర్శ లేకపోవడం
- రాజంపేట ఇన్‌చార్జి ఇవ్వకపోవడంతో అవమానంగా భావించిన వైనం



సుగవాసి బాలసుబ్రహ్మణ్యం

సాక్షి ప్రతినిధి, కడప : తెలుగుదేశం పార్టీ బలిజ సామాజిక వర్గ నేతలను వ్యూహాత్మకంగా దూరం పెడుతోందా.. ఎన్నికల్లో వాడుకొని ఆపై ప్రాధాన్యత లేకుండా చేస్తోందా అంటే ఔను అనే విశ్లేషకులు జవాబిస్తున్నారు. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు, సుగవాసి బాలసుబ్రమణ్యంలకు కరివేపాకు సామెతను వర్తింపజేశారు. యూజ్ అండ్ త్రో పాలసీ అమలు చేశారు. ఎన్నికల్లో వాడుకుని ఆపై ఏమీ పట్టనట్లు వదిలేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బలిజ సామాజిక వర్గ నేతలను క్రమేపీ దూరం చేశారు. ఆలోచనలు, వ్యూహం, ఎత్తుగడలు మీవే, ఆచరణలో మాత్రమే మేముంటామని చెప్పుకొచ్చి ఎన్నికల్లో వాడుకున్నారు. అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత లేకుండా చేశారు. వెరసి టీడీపీతో ఉన్న 40 ఏళ్ల అనుబంధాన్ని దివంగత మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు కుమారుడు బాల సుబ్రహ్మణ్యం తెంచుకున్నారు. ఆయన శనివారం టీడీపీకి రాజీనామా చేశారు. ఈ అంశం ఉమ్మడి జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది.

నాడు చక్రం తిప్పి..

జిల్లాలో బలిజ సామాజికవర్గాన్ని తెలుగుదేశం పార్టీ క్రమేపీ దూరం పెడుతోంది. ఒకప్పుడు చక్రం తిప్పిన నేతలంతా కనుమరుగయ్యారు. మేధస్సు, సామాజిక బలంతో ఎమ్మెల్సీ రామచంద్రయ్యకు ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ కండువా కప్పారు. ఎన్నికల్లో కోరి రామచంద్రయ్యను రప్పించుకున్నారు. ఎన్నికల తర్వాత విస్మరిస్తూ వచ్చారు. అధికారిక కార్యక్రమాల్లో ఎందులోనూ రామచంద్రయ్యకు ప్రాధాన్యత లభించలేదు. జిల్లాలో కూడా అదే పరిస్థితి. ఎమ్మెల్యే మాధవీరెడ్డి పూర్తిగా విస్మరించారనే ఆరోపణలున్నాయి. ఉనికి కోసం అన్నట్లుగా ఎమ్మెల్సీ రామచంద్రయ్య అప్పుడప్పుడు కన్పించడం ఆరంభించారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

మనస్తాపం చెందిన సుగవాసి కుటుంబం

తెలుగుదేశం పార్టీ వైఖరిపై సుగవాసి బాలసుబ్రహ్మణ్యం మనస్తాపం చెందారు. సీఎం చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి సహచరుడిగా మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు ఉన్నారు. మునుపటి కాలంలో రాయచోటి ఎన్నికలంటే ప్రత్యక్ష యుద్ధం తెరపైకి వచ్చేది. 1978, 83, 99, 2004లో రాయచోటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1984–89 కాలంలో రాజంపేట ఎంపీగా పని చేశారు. అలాంటి రాజకీయ చరిత్ర ఉన్న పాలకొండ్రాయుడు అనారోగ్యంతో మృతి చెందితే.. ఆయన కుటుంబ పరామర్శకు రాలేదు. జిల్లాలో మహానాడు చేపట్టినా ఆ కుటుంబం వరకూ పోయి వద్దామనే ఆలోచన లేకపోయింది. మరో వైపు రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా సుగవాసి బాలసుబ్రమణ్యం పోటీ చేసి ఓడిపోతే, కనీసం ఇన్‌చార్జిగా కూడా కేటాయించలేదు. అటు అధిష్టానం వద్ద ఇటు స్థానికంగా మర్యాద లేకుండా పోయింది. పొమ్మనకుండా పొగబెట్టడంతో టీడీపీతో ఉన్న 40 ఏళ్ల అనుబంధాన్ని సుగవాసి బాలసుబ్రహ్మణ్యం తెంచుకోవాల్సి వచ్చిందని పలువురు వివరిస్తున్నారు.

» బత్యాల కనుమరుగు..



బత్యాల చెంగల్‌రాయుడు

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలో అన్నీ తానై నడిపించిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు ఇటీవల కాలంలో పూర్తిగా కనుమరుగయ్యారు. రైల్వేకోడూరు, రాజంపేట సెగ్మెంట్లలో కాపు సామాజిక వర్గాన్ని అనువుగా మల్చుకునేందుకు ఎన్నికల ముందు బత్యాలకు ప్రాధాన్యత లభించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత చెంగల్‌రాయుడును రాజకీయంగా దెబ్బకొట్టే చర్యలకు టీడీపీ వ్యవహరిస్తూ వస్తోంది. మరోవైపు సుగవాసి బాలసుబ్రమణ్యం రాజంపేట నుంచి తప్పించే క్రమంలో.. బత్యాలకు ప్రాధాన్యత లభించిందా అంటే అదీ లేదు. కాగా, పరిశీలకుడిగా కడపకు చెందిన అదే సామాజిక వర్గానికి చెందిన దుర్గా ప్రసాద్‌రావును నియమించారు. దుర్గా ప్రసాద్ మీద ప్రేమతో వేశారంటే తప్పులో కాలేసినట్లేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. 2014లో కడప టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన దుర్గాప్రసాద్‌కు తర్వాత ఇన్‌చార్జి పదవి అప్పగించలేదు. టీడీపీ అధికారంలో ఉండగా ఆ పదవి ఆర్.శ్రీనివాసులరెడ్డికి అప్పగించారు. బలిజ సామాజిక వర్గనేతల్ని తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా దెబ్బతీస్తున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు



వాహనదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగర శివార్లలోని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు ప్రజలకు ట్రాఫిక్ రూల్స్ గురించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేసి ప్రమాదాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయం సిబ్బందితో మాట్లాడి మీకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విత్తన ఎంపికే కీలకం

- విత్తన కొనుగోలులో సరైన జాగ్రత్తలు పాటించాలి
- నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు
- పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులు భద్రం
- ఖరీఫ్‌లో 1,28,084 హెక్టార్లలో సాగు



విత్తనవడ్ల బస్తాలు



ఇలా మొలకెత్తాలి

కడప అగ్రికల్చర్ : పంటల సాగులో విత్తన ఎంపిక అత్యంత కీలకం. ఇది పంటల దశ, దిశ మార్చడంతో పాటు మంచి దిగుబడులకు దోహదం చేస్తోంది. అలాగే మంచి విత్తన ఎంపిక జరిగితేనే చీడపీడలను తట్టుకుని నాణ్యమైన దిగుబడిని ఇచ్చే అవకాశం కూడా ఉంటుంది. కనుక రైతులు విత్తన ఎంపిక, కొనుగోలులో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకుని అటు వ్యవసాయ అధికారులతోపాటు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించాల్సి అవసరం ఉంది. ఎందుకంటే విత్తన ఎంపికలో ఏదైనా పొరపాటు జరిగితే పంట సాగు మొదలుకుని దిగుబడి వరకు పెట్టిన పెట్టుబడి ఖర్చుతో రైతుల కష్టం నేలపాలు అవుతుంది. దీంతో రైతన్నలు ఆర్థికంగా చితికిపోతారు. పంటలు సాగు చేసే ముందు విత్తన ఎంపిక తదితర విషయాల్లో రైతులు కచ్చితంగా వ్యవసాయ, శాస్త్రవేత్తల సలహాలను పాటించాల్సి ఉంది.

ప్రారంభమైన ఖరీఫ్ సీజన్..

ఏడాది ముందస్తు రుతుపవనాల ఆగమనంతో జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,28,084 హెక్టార్లలో వివిధ పంటలు సాగు కానున్నాయి. అలాగే ప్రభుత్వం కూడా పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీతో మంజూరు చేసింది. దీంతో పాటు నదీ పరివాహక ప్రాంతాలైన సిద్దవటం, చెన్నూరు. కమలాపురం, చాపాడు తదితర మండలాల పరిధిలో నీటి వసతి ఉన్న వారు వరినారు సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతోపాటు వర్షాధారిత ప్రాంతాల్లో కూడా అక్కడక్కడా వేరుశనగను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు ఎక్కడపడితే అక్కడ వరి, వేరుశనగ, జొన్నలు, సజ్జలు, మినుములు, మొక్కజొన్న వంటి విత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. ఇలా కొనుగోలు చేసే రైతులు స్థానిక వ్యవసాయ అధికారులు సర్టిఫైడ్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. అలాగే షాపు యజమాని లైసెన్సు ఉందా లేదా అని తెలుసుకోవాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు కచ్చితంగా బిల్లులు కూడా అడిగి తీసుకోవాలి. తీసుకున్న విత్తన బిల్లులను పంట దిగుబడి చేతికి వచ్చే వరకు భద్రంగా దాచుకోవాలి. లేకుంటే విత్తన ఎంపికలో ఏదైనా పొరపాటు జరిగితే దిగుబడులు తగ్గి రైతన్నలు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిణామాలను మనం పలు చోట్ల చూస్తునే ఉన్నాం. ఈ నేపథ్యంలో వరితోపాటు ఇతర విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. విత్తనమే దిగుబడులను నిర్ణయిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి.
- విత్తనాల కొనుగోలు సమయంలో డీలర్ల వద్ద తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలి.

పంటపేరు	సాగు హెక్టార్లలో
వరి	30804
మిల్లెట్స్	34472
మినుము	3806
వేరుశనగ	5976
ఉల్లి	5203
టమాట	1329
పొద్దుతిరుగుడు	1142
మిరప	1679
కంది	5761

- బిల్లుపై విక్రయదారుడి పేరు, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, విత్తనరకం, గడువుతేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- ఎక్కడ కూడా లూజు విత్తనాలు, గడువు దాటిన విత్తనాలను ఎలాంటి పరిస్థితుల్లో కొనుగోలు చేయకూడదు.
- కొనుగోలు చేసే విత్తనాల ప్యాకెట్ల నుంచి సంచిపైన సీల్ ఉందా, లేదా అని ముఖ్యంగా చెక్ చేసుకోవాలి.
- రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు విక్రయదారులు ఇచ్చే కరపత్రాలను తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలు పూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలి.
- విత్తనం కొనుగోలు చేసిన వెంటనే పరీక్షించాలి. మొలక శాతం సంతృప్తిగా ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి.
- మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.

బిల్లులు కచ్చితంగా తీసుకోవాలి..



డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసే రైతులు కచ్చితంగా బిల్లులు అడిగి తీసుకోవాలి. పంట దిగుబడి వచ్చే వరకు రైతులు బిల్లులను భద్రంగా దాచుకోవాలి. పంటలో పూత పిందె, దిగుబడిలో తేడా వస్తే స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

మొలక శాతం పరీక్షించాలి..



రైతులు ఎవరైనా బయట డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితుల్లో లైసెన్సులు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాల మొలకశాతం చెక్ చేసుకోవాలి. మొలకశాతం తక్కువగా ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దు. మొలకశాతం బాగుంటేనే విత్తనాలను కొనుగోలు చేసుకోవాలి.

– డాక్టర్ వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, కడప

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీపై అక్రమ కేసు

- చీనీ చెట్ల నరికివేత కేసులో ఇరికించిన పోలీసులు
- కక్ష సాధింపులో భాగమే అంటున్న కుటుంబ సభ్యులు

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా నిలువరించాలని పోలీసులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారనేందుకు ఈ సంఘటనే నిదర్శనం. కొండాపురం మండలం యనమల చింతల గ్రామంలో ప్రసాద్‌కు సంబంధించిన 41 చీనీ చెట్లను శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు ప్రసాద్‌కు అంజి అనే వ్యక్తితో స్వల్ప తగాదాలు ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అయితే ఈ సంఘటనతో ఎలాంటి సంబంధం లేకున్నా ఎంపీటీసీ రెడ్డిపల్లి నాగేశ్వర్, అతని అన్న రెడ్డిపల్లి నాగార్జునలను తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశవరెడ్డి కావాలనే కేసులో ఇరికించారని వారి కుటుంబ సభ్యులు వాపోతున్నారు. గతంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిని కామెంట్ చేశావు.. అందుకే ఈ కేసుతో మీకు సంబంధం లేకపోయినా ఇరికిస్తున్నానని ఎంపీటీసీతో ఎస్‌ఐ పేర్కొన్నట్లు బంధువులు తెలిపారు.

ఈ విషయమై ఎస్‌ఐ హృషికేశవరెడ్డిని వివరణ కోరగా చీనీ చెట్ల నరికివేత కేసులో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఎలాంటి సంబంధం లేకున్నా కేసు ఎలా పెడతారు.. సాక్షి వాళ్లు ఎలాగైనా రాసుకోండి.. వారు ఒప్పుకున్నారు.. అంటూ చెప్పుకు వచ్చారు.

ప్రాణం తీసిన ఈత సరదా

పెన్నానదిలో దిగి తండ్రీ తనయుల దుర్మరణం





మృతి చెందిన మనోహర్, డియోల్

జమ్మలమడుగు : సరదాగా ఈత కొట్టేందుకు పెన్నా నదిలోని నీటిలోకి దిగిన తండ్రీ కొడుకులు దుర్మరణం చెందిన సంఘటన శనివారం జమ్మలమడుగు మండలంలో జరిగింది. వివరాలు ఇలా..తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన మనోహర్ (38), అతని కుమారుడు డియోల్ (17) పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన సోదరి ప్రమీలా రాణి ఇంటికి వచ్చారు. శనివారం పర్యాటక కేంద్రమైన గండికోటను సందర్శించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ముద్దనూరు–జమ్మలమడుగు రహదారిలోని పెన్నానదిలో నీటిని చూసి ఈత కొట్టేందుకు దిగారు. బ్రిడ్జి సమీపంలో గుంత ఉన్న విషయం వారికి తెలియదు. తొలుత మనోహర్ నీళ్లలోకి దిగగానే అక్కడ పెద్ద గుంత ఉండటంతో అందులో పడిపోయాడు. గమనించిన కుమారుడు డియోల్ తండ్రిని కాపాడేందుకు ప్రయత్నించి అతను కూడా అదే గుంతలో కూరుకుపోయి గల్లంతయ్యారు. తమ కళ్లెదుటే తండ్రీ కొడుకులు నీళ్లలో గల్లంతు కావడంతో తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో తండ్రి, కుమారుడి మృతదేహాలను బయటికి తీశారు. ఇద్దరి మృతదేహాలను చూసిన బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వడం వల్లే మరణాలు

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : అధికారుల నిర్లక్ష్యంతో పెన్నానదిలో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. దీంతో పెన్నాలో ఎక్కడ ఎంత లోతు ఉందో తెలియక నీటిలోనికి దిగిన వారు ప్రాణాలు కోల్పోతున్నారు.. అని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. పెన్నా నదిలో ఈతకు దిగి మృతి చెందిన వారి కుటుంబీకులను శనివారం రాత్రి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ పెన్నానదిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిగాయన్నారు. ఇరవై అడుగుల లోతు వరకు కూడా ఇసుకను తవ్వేశారన్నారు. ప్రస్తుతం పెన్నానదిలో నీరు వచ్చి చేరిందని, ఎక్కడ ఎంత లోతు ఉందో ఎవరికి తెలియని పరిస్థితి ఉందన్నారు. పెన్నానది బ్రిడ్జి సమీపంలోనే గతంలో చాలా మంది మరణించారని గుర్తు చేశారు. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అక్కడ ప్రమాదానికి సంబంధించిన సూచిక బోర్డులు కూడా పెట్టకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు పెన్నానది ప్రాంతంలో ఎక్కడెక్కడ ఎంత లోతు గుంతలు ఉన్నాయో గుర్తించి అక్కడ ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మృతుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సంఘటనను జిల్లా కలెక్టర్ శ్రీధర్‌కు ఫోన్ చేసి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వివరించారు.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి



గాయపడ్డ సుదర్శన్‌రెడ్డి

పుల్లంపేట : పుల్లంపేట మండల పరిధిలోని రంగంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీసీపీ నాయకుడు, అనంతంపల్లి సహకార బ్యాంక్ మాజీ సింగిల్ విండో ప్రెసిడెంటు సుదర్శన్‌రెడ్డిపై శనివారం రాత్రి పుల్లంపేట పోలీస్‌స్టేషన్ కూతవేటు దూరంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పుల్లంపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు తదితరులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై కూటమి నాయకులు దాడి చేయడం పరిపాటిగా మారింది. ప్రశాంతంగా ఉన్న పుల్లంపేట మండలంలో కూటమి నాయకులు దాడి చేయడంతో సామాన్యులు భయాందోళనకు గురవుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పుల్లంపేట ఎస్‌ఐ తెలిపారు.

ఉత్సాహంగా ఏసీఏ సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ



విన్నర్‌గా నిలిచి కప్‌ను అందుకున్న అనంతపురం జట్టు



5 వికెట్లు తీసుకున్న చిత్తూరు బౌలర్ రెడ్డి ప్రకాష్



86 పరుగులతో నాటౌట్‌గా చిత్తూరు బ్యాట్స్‌మెన్ లోహిత్ లక్ష్మీనారాయణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ – 23 వన్డే క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై చిత్తూరు జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 44.4 ఓవర్లలో 208 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి సూర్య తేజ 80, యజ్ఞేశ్వర్ 51 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని రెడ్డి ప్రకాష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. తేజ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 209 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 23.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 86 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తేజ రెడ్డి 62 పరుగులు చేశాడు.

వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో..

వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కడప జట్టుపై 6 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 35.2 ఓవర్లలో 151 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఎస్‌ఎండీ అయాజ్ 52, వాసు దేవరాజు 36 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దీపక్ 4, కామిల్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 152 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 22.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ 78 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఆదిల్ హుస్సేన్ 3 వికెట్లు తీసుకున్నాడు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా రెడ్డి ప్రసాద్

వల్లూరు (చెన్నూరు) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా తనను ఎంపిక చేసినట్లు చెన్నూరుకు చెందిన రెడ్డి ప్రసాద్ తెలిపారు ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడి నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రూ. కోట్ల విలువైన స్థలం ఆక్రమణ



ప్రభుత్వ స్థలం చదును చేసి నిర్మాణం కోసం తరలించిన సామగ్రి



కబ్జాకు గురైన స్థలంలో గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అట్లూరు : అధికార పార్టీ నేతల భూదాహానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ జాగా కనిపిస్తే అక్కడ వాలిపోతున్నారు.

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం పక్కనే గుంతపల్లి రెవెన్యూ పొలంలో సర్వే నంబరు 948లో 10.38 ఎకరాలు(పది ఎకరాల 38 సెంట్లు విస్తీర్ణం) ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి సెంటు సుమారు రూ.10 లక్షల వరకూ విలువ చేస్తుంది. అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ ముఖ్య నేత అనుచరుడికి ఆ భూమిపై కన్ను పడింది. ఇంకేముంది అదును కోసం ఎదురు చూశాడు. శనివారం బక్రీద్ పండుగ సెలవు అలాగే ఆదివారం కూడా సెలవు దినం కావడం ఆయనకు కలిసి వచ్చింది. శుక్రవారం రాత్రి నుంచి స్థలంలో సుమారు 50 సెంట్ల మేర అంటే ఐదు కోట్ల రూపాయలు విలువ చేసే మేర స్థలంలో యంత్రాలతో చదును చేయించుకున్నాడు. ఎవరూ అడ్డు లేకపోవడంతో శనివారం ఆ స్థలంలో నిర్మాణం కోసం సామగ్రిని తరలించాడు. ఇంత విలువైన స్థలంలో అక్రమ నిర్మాణాలకు ఏర్పాట్లు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.

హెచ్చరిక బోర్డును లెక్క చేయని వైనం..

గుంతపల్లి రెవెన్యూ పొలంలోని సర్వే నెంబరు 948లో 10.38 ఎకరాలు విస్తీర్ణంలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు గతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఆ బోర్డు తమకు కాదనుకున్నారేమో బోర్డును సైతం లెక్క చేయకుండా అధికార పార్టీ నేతలు ఆక్రమించడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం..

సర్వే నంబరు 948లో విలువైన ప్రభుత్వ భూమిని టీడీపీ నాయకుడి అనుచరుడు కబ్జాకు పాల్పడిన విషయమై బద్వేలు తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్‌రాజును వివరణ కోరగా నెల రోజులుగా తాను అందుబాటులో లేనని, నిన్ననే విధుల్లో చేరానని తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన విషయం తన దృష్టికి వచ్చిందని, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేయకపోతే ఉద్యమమే

కదం తొక్కిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు నిర్వహించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకునే వరకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఐక్య వేదిక నాయకులు సంగమేశ్వరరెడ్డి, శివారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ పెద్దలు మాటిచ్చారు.. మాట నిలుపుకోండంటూ శనివారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ప్రభుత్వం చెప్పిందన్నారు. మరి ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ అంటున్నారు ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికే తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్న ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతూ ఈనెల 8 వ తేదీన కడప డీఈఓ కార్యాలయ ముట్టడి చేయనున్నామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్టీయూ, పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్–257, ఏపీటీఎఫ్ 1938, ఆపస్, వైఎస్సార్‌టీఎఫ్, ఎస్‌టీఎఫ్, పీఈటీ అసోసియేషన్, ఎస్‌ఆర్‌టీఎఫ్, ఎన్‌టీఏ, ఎస్సీ, ఎస్టీ సంఘం తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

పంట కాలువ పూడ్చి.. ఆపై ఆక్రమించి!

చక్రాయపేట మండలంలో టీడీపీ వర్గీయుల ఆక్రమణ పర్వం



అద్దాలమర్రి వద్ద పంట కాలువను జేసీబీతో పూడ్చి వేయిస్తున్న టీడీపీ వర్గీయులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చక్రాయపేట మండలం అద్దాలమర్రి గ్రామంలో టీడీపీ వర్గీయులు రైతుల పొలాలకు నీటిని అందించాల్సిన పంట కాలువను పూడ్చి తమ పొలంలో కలిపేసుకున్నారు. ఈ ఆక్రమణను గ్రామస్తులు అడ్డుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. కొందరు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అద్దాలమర్రి గ్రామంలోని ఆయకట్టు భూములకు పాపాఘ్ని నది నుంచి పెద్ద కాలువ ద్వారా నీరు వస్తుండేది. ఈ కాలువ కుమార్ల కాల్వ వద్ద నుంచి ఉండేది. అయితే అద్దాలమర్రికి చెందిన టీడీపీ వర్గీయులు కొందరు కాలువను పూడ్చి తమ పొలంలో కలుపుకుంటే విస్తీర్ణం పెరుగుతుంది.. పైగా తమ ప్రభుత్వం అధికారంలో ఉంది.. ఎవరు అడ్డు వచ్చినా తమకేమీ భయం లేదని భావించి ఏకంగా జేసీబీని రప్పించుకొని కాలువను పూడ్చేశారు. కొందరు రైతులు వెళ్లి ఇదేమి న్యాయం .. పూర్వ కాలం నుంచి గ్రామంలోని రైతులందరికీ సాగునీరు అందించే కాలువ ఎలా పూడుస్తారని నిలదీశారు. దీంతో తమకు రెవెన్యూ అధికారులు చెప్పడంతోనే పూడ్చేశాం. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకో పొండి అంటూ ఎదురు దాడికి దిగుతున్నారని రైతులు వాపోయారు. ఈ విషయంపై పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని అయినా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని రైతులు వాపోతున్నారు.